క్లుప్తంగా

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

పెదకూరపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బెల్లంకొండ మీరయ్య పేర్కొన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు పీహెచ్‌సీలో సోమవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సేవలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎస్.ప్రియాంక, తహసీల్దారు క్షమారాణి, సర్పంచ్ మేకల కుమారి, రామాపురం సర్పంచ్ బిరుదల ఎలీశమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ఆరా



రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా సోమవారం రాజుపాలెం గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై పరిశీలన చేశారు. లబ్ధిదారులతో సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయ, ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఈవోపిఆర్‌డీ పగడాల ముక్కంటి హెచ్‌వో రమేష్‌బాబు, పీఎస్ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సోషల్ స్టడీ మెటీరియల్ పంపిణీ



సత్తెనపల్లి: మండల పరిధిలోని వెన్నదేవి జెడ్పీ స్కూల్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున శర్మ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే సమయపాలన చాలా ముఖ్యమైనదని, సమయాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలరని అన్నారు. అలాగే ప్రతి విద్యార్థి ఇప్పటినుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు అంటూ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఈసందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు దాత కె. సురేష్ కుమార్ దాతృత్వంతో సోషల్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందము విద్యార్థిని, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు నాని, తదితరులు ఉన్నారు.

బాలికలకు సమాజంపై అవగాహన ఉండాలి

అమరావతి: బాలికా హక్కులు, సమాజంలో స్త్రీలపైన జరుగుతున్న అకృత్యాలపై అవగాహన కలిగి ఉండాలని ల్యాంప్ సంస్థ కో–ఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో మై చాయిస్ ఫౌండేషన్, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడారు.. బాలికలు ధైర్యంగా ఉండి.. తమ హక్కులను సాధించుకోవాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, గృహహింస పైన పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. గ్రామ గ్రామాన ల్యాంప్ సంస్థ ద్వారా సురక్షిత గ్రామ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సురక్షిత గ్రామ పుస్తకాలను పంపిణీ చేశారు.

నందిగామలో స్పర్శ అవగాహన సదస్సు

సత్తెనపల్లి: చేయి చేయి కలుపుదాం..కుష్ఠువ్యాధి నిర్మూలిద్దామని స్పర్శ అవగాహన సదస్సులో భాగంగా సోమవారం ప్రతిజ్ఞ చేశారు. సదస్సులో ఫణిదెం డిప్యూటీ పారామెడికల్ అధికారి డి. నాగేశ్వరరావు నాయక్ కుష్ఠువ్యాధి లక్షణాలు, నివారణ చర్యలకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సబ్ సెంటర్ సిహెచ్ ఓ గణేష్, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, అంగన్వాడీ కార్యాకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమ్మర్ల సత్రానికి గౌరవ సలహాదారుడిగా కోటపాటి

రాజుపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటప్ప కొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కుమ్మర్ల అన్నదాన సత్రంకు గౌరవ సలహాదారులుగా మండలంలోని బలిజేపల్లి గ్రామానికి చెందిన కోటపాటి వెలుగొండయ్యను నియమించినట్లు సోమవారం ఆయన తెలిపారు. తనకు ఈ పదవికి ఎంపిక చేసిన శాలివాహన సత్రం కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. సత్రంలో జరిగే నిత్య అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సంక్షేమ ఫలాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య సబ్‌సెంటర్‌లు ఏర్పాటు చేసి పాలన ప్రజల ముంగిటకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారని ఎమ్మెల్యే నంబూరుశంకరరావు పేర్కొన్నారు. సోమవారం క్రోసూరు సచివాలయం–2 పరిధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల ఏ విధంగా అందుతున్నాయి.. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు, మహిళలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. నవరత్నాల పథకాలన్నీ అందుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సచివాలయం–2 పరిధిలో రూ.10.69 కోట్లు సంక్షేమ పథకాలు, రూ.83 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జడ్పీటీసీ షేక్ జమీల, షేక్ గపూర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుములకోటిరెడ్డి, షేక్ ఖాదర్, పాశం శ్రీనివాసరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ షరీఫ్, మాజీ యార్డు డైరెక్టర్ అంబటి నారాయణ, అత్తోట అప్పారావు, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాసు, మండల కన్వీనర్ వెలది అప్పారావు, సచివాలయ కన్వీనర్ సయ్యద్ అబ్దుల్ రహీం, మేదర రోశయ్య, షేక్ షుకుర్, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి శరత్‌కుమార్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు క్రోసూరులో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం క్రోసూరు సచివాలయం–2 లో రెండవ రోజు మంగళవారం కొనసాగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.

కుష్ఠు వ్యాధి పై అవగాహన ఉండాలి



పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



పీహెచ్‌సీలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వైద్యసిబ్బంది

ముప్పాళ్ల: కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమాదేవి చెప్పారు. స్థానిక పీహెచ్‌సీలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. చర్మం పై స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారటం, కాళ్ళు చేతులు తిమ్మిర్లు, అరచేతుల్లో, అరికాళ్ళలో స్పర్శ కోల్పోవడం, చిటికెన వేలు, బొటనవేలు సన్నబడటం, మణికట్టు లేక మడమను పైకి లేపలేకపోవడం వంటి లక్షణాలు కూడా ఉండవచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేపట్టాలన్నారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, డీడీఎమ్ఓ పాపారావు, ఆరోగ్యపర్యవేక్షకులు ఏ.పీటర్‌డానియేల్, నాగమల్లేశ్వరరావు, జోస్ఫిన్‌రాణి, భవానికుమారి, చంద్రశేఖర్, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన

క్రోసూరు: ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా.. సోమవారం కుష్ఠు నివారణపై అవగాహన కార్యక్రమం 'స్పర్శ'ను క్రోసూరు పీహెచ్‌సీలో నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రవీణ దీప్తి ఆధ్వర్యంలో చేయి చేయి కలుపుదాం, కుష్ఠు వ్యాధి నిర్మూలిద్దాం అంటూ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ప్రతి సచివాలయంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యాధి లక్షణాలు తెలిపారు. ఛర్మంపై సర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల ఛర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కను రెప్పలపై వెంట్రుకలు రాలి పోవటం, మూతపడటం, ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారటం, కాళ్లు, వేళ్లు తిమ్మిర్లు, అర చేతులు, అరి కాళ్లల్లో సర్శ కోల్పోవటం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవటం, చేతుల నుంచి వస్తువులు, కాళ్లకు చెప్పులు జారిపోవటం తదితర లక్షణాలుంటే ఆరోగ్య కార్యకర్తలు సర్వేకు వచ్చినపుడు తప్పకుండా తెలియజేయలని చెప్పారు. ప్రతి పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్త ఉచితంగా ఎండీటీ మందులు ఇస్తారని వెల్లడించారు. ముందుగా గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సాంబశివరావు, యూడీసీ షేక్ బాషా, ఎంపీ హెచ్ఎస్ శివుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్ముని విధానాలు అనుసరణీయ మార్గాలు



పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మగాంధీ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



పట్టణంలోని గాంధీచౌక్‌లో మహాత్మగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

సత్తెనపల్లి: మహాత్మగాంధీ ఒక పేరు మాత్రమే కాదని ఓ ఆచరణీయ మార్గమని విశ్వాసం, కార్యాచరణ, ప్రజాకర్షణ అనే మూడింటిని తన జీవితంలో భాగస్వామ్యం చేసుకుని ప్రజల మన్ననలు పొందిన మహనీయుడని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. మహాత్మ గాంధీ 75వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్లంచర్ల మాట్లాడుతూ ఓ వైపు స్వాతంత్ర్య పోరాటం కొనసాగిస్తూనే మరోవైపు శాంతి సామరస్యాల కోసం ఉద్యమించిన రాజకీయ వేత్త అన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్, సత్తెనపల్లి రూరల్ మండల్ పార్టీ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు మాట్లాడుతూ మహాత్ముని జయంతి, వర్ధంతిలను నిర్వహించుకుంటూ ఆయన విధానాలను నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం మనపై ఎంత ఉందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కన్వీనర్ షేక్ నాగూర్ మీరాన్, కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, కాకుమాను రవి, గుజ్జర్లపూడి సతీష్, నాయకులు సిరిగిరి వెంకట్రావు, వల్లేమ్ నరసింహారావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, బండి మల్లికార్జున రెడ్డి, చిలక జైపాల్, ఆకుల హనుమంతరావు, శివసాయి. తది తరురులు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో .....

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు మహాత్మ గాంధీ 75వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వార్డు కౌన్సిలర్లు, కార్యాలయ మేనేజర్ ఎస్ సాంబశివరావు, డీఈ బి మధుసూదన్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి పి రామారావు, రెవిన్యూ అధికారి అప్పారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ యమ్.విజయసారధి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో......

పట్టణంలోని గాంధీ చౌక్‌లో మహాత్మ గాంధీ 75వ వర్ధంతిని పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య ఆధ్వర్యంలో జరిగింది. మహాత్మ గాంధీ, దేశ నాయకుల విగ్రహాలకు పూలమాలలు సమర్పించి ఆయన సేవలను మననం చేసుకుని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదన రావు, దేవరశెట్టి రవికుమార్, దివ్వెల శ్రీనివాసరావు, మెమెంటో సుబ్బారావు, కొత్త రామకృష్ణ, అయినవోలు కోటేశ్వరరావు, వనమా నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వీల్ చైర్ బహూకరణ



ఏరియా వైద్యశాలకు వీల్ చైర్ బహూకరణ చేస్తున్న రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో కుంచనపల్లి శ్రీనివాసరావు సహకారంతో సోమవారం వైద్యశాలకు వీల్ చైర్ అందించారు. ఆవోపా పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ హాస్పటల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అదేవిధంగా హాస్పటల్ అభివృద్ధి కమిటీకి ఎన్నడూ లేనటువంటి మంచి పేరును కొత్త రామకృష్ణ తీసుకుని వచ్చారని కొనియాడారు. సూపరిండెంట్ వెంకట్రావు మాట్లాడుతూ హాస్పిటల్ కి అవసరమైన మౌలిక వసతులు ఏది కావాలన్నా అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ దాతల సహకారంతో అందిస్తున్నారన్నారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ నిత్యం పేషెంట్లు రాకతో పూర్తిస్థాయి సామర్థ్యంతో హాస్పిటల్ పని చేస్తుందని, వీల్ చైర్లు అవసరం ఉందని ఆ వోపా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావుని కోరగా వెంటనే స్పందించి వీల్ చైర్ ఇప్పిచ్చారని, వారికి హాస్పటల్ అభివృద్ధి కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్టా శంకర రావు, గంటా విజయభాస్కర్ రెడ్డి, గద్దం శివశంకర రావు, వేపూరు వెంకటేశ్వర్లు, హాస్పటల్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌షాక్ కు గురైన బాలుడు చికిత్సపొందుతూ మృతి

నకరికల్లు: విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన బాలుడు కుటుంబానికి తగిన పరిహారం అందజేసి ఆదుకోవాలని హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ నాయకులు పి.కృపాసత్యం డిమాండ్ చేశారు. నకరికల్లుకు చెందిన సీహెచ్.గౌతంబాబు(8) ఈనెల 18వతేదీన విద్యుత్‌షాక్‌కు గురై చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. బాధిత కుటుంబీకుల ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై సోమవారం ధర్నా చేపట్టారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే బాలుడు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడని మండిపడ్డారు. ప్రమాదం జరిగి 10 రోజుల పైగా గడుస్తున్నా ఆశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్‌శాఖ అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.సురేష్ ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడంతో ధర్నా విరమించారు. అనంతరం తహశీల్దార్ ఎస్. సురేష్, ఎస్ఐ సురేష్‌లు బాధితులతో చర్చలు జరిపారు.

కుష్ఠుపై అవగాహన

రాజుపాలెం: నేటి నుంచి 13వ తేదీ వరకు లెప్రసీపై అన్ని గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తామని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లు కేవీ కృష్ణకుమార్, రవి తేజనాయక్‌లు తెలిపారు. రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాంధీజీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీజీ కుష్ఠువ్యాధి నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించారని, అందువల్ల ఆయన వర్ధంతిని పురస్కరించుకుని కుష్ఠువ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రతిజ్ఞ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, గంగాధర్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గురజాల : ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రెంటచింతల మండలం పాలువాయి గ్రామానికి చెందిన రాయపాటి సాగర్ (40) ఆర్థికం ఇబ్బందులు తట్టుకోలేక గత కొద్ది రోజులుగా మానసింగా ఇబ్బందులు పడుతున్నాడని ఈనెల 23వ తేదీన ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య సలోమి భర్తకు ఫోన్ చేయడంతో ఆత్మహత్య చేసుకునేందుకు గురజాలకు వచ్చినట్లు పురుగు మందు తాగుతున్నానని చెప్పడంతో వెంటనే బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి గురజాల మండలం అంబాపురం గ్రామ సమీపంలో కోల్డు స్టోరేజ్ వద్ద ఉన్నట్లు గుర్తించి ఆ ప్రాంతానికి వెళ్లి 108లో గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేసి అనంతరం నరసరావుపేటకు రిఫర్ చేయగా నరసరావుపేట నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం కలరు. ఎస్ఐ అశోక్ బాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే నంబూరు



అచ్చంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం వినుకొండలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. జగనన్న చేదోడు పథకం ద్వారా నియోజకవర్గంలో 2,673 మంది లబ్ధిదారులకు రూ.2.68కోట్ల సాయం అందిందని తెలిపారు. సీఎం జగన్ ద్వారానే బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు.

5న పునఃప్రతిష్ఠా మహోత్సవం



పునఃప్రతిష్ఠా మహోత్సవానికి సిద్ధమైన శ్రీ సీతారామస్వామి దేవాలయం

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరులో ఫిబ్రవరి 5న మాఘశుద్ధ పౌర్ణమి నాడు శ్రీ సీతారామస్వామి దేవాలయంలో పునఃప్రతిష్ఠా మహోత్సవం వేడుకగా జరుగనుంది. అయిదు రోజుల పాటు పూజలు, యజ్ఞాలు నిర్వహించేందుకు యజ్ఞశాల ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ నుంచి కీర్తి ధ్వజం, కోనసీమ నుంచి జీవధ్వజం తెప్పించారు. ఆలయ పునఃనిర్మాణానికి అనువంశిక ధర్మకర్తలు చిర్రా పుల్లారెడ్డి, శేషారత్నం కుమారులు రాజశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి మ్యాచింగ్ గ్రాంటు కింద రూ.22.67లక్షలు సమకూర్చారు. దేవాదాయశాఖ రూ.45.33 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, గ్రామ పెద్దలు గుత్తికొండ అంజిరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, ధర్మకర్తల మండలి ప్రతినిధి కల్లి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఆలయ నిర్మాణ పనులు శరవేగంతో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో ప్రతిష్ఠా క్రతువు జరుగనుంది. ఈ సందర్భంగా పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించి, అన్నదానం చేయనున్నారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు

ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకటేశ్వరరావు

అచ్చంపేట: విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. బట్టీ విధానానికి స్వస్తి చెప్పి.. విషయంపై పూర్తిగా అవగాహన చేసుకుని, ప్రశాంతతో ఉండటం అలవరచుకోవాలని విద్యార్థులకు చెప్పారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు స్టడీ అవర్స్ నిర్వహించి.. విద్యార్థులు ఏకాగ్రత సాధనకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. అనంతరం పాఠశాల రిజిష్టర్లు, మాధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ తదితర విషయాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు రాజశేఖర్ ఉన్నారు.

గాంధీజీ ఆశయాలు నేటికీ ఆదర్శం



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

అమరావతి: జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయస్ఫూర్తి భారత పౌరులందరికీ ఆదర్శమని మునగోడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గాంధీజీ వర్ధంతిని సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతి పితకు ఘన నివాళి

ముప్పాళ్ళ: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బి.వెంకటేశ్వరరావు, అనుమాలశెట్టి శ్రీరంగనాయకులు, పొట్టి శ్రీరామకృష్ణ, అడ్డగిరిరామారావు, పొట్టిశివరామకృష్ణ, ఏ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఐక్యవేదిక కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి

నకరికల్లు: బడుగు, బలహీనవర్గాల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలిపారు. పల్నాడు జిల్లా బలహీనవర్గాల ఐక్యవేదిక కార్యాలయాన్ని సోమవారం నకరికల్లులో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్య, ఉపాధి అవకాశాలతో పాటు రాజకీయంగా కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌అహ్మద్, పలువురు ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



కుంకలగుంట గ్రామంలోని ప్రచార కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు

నకరికల్లు: ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుని ప్రజలందరూ జ్ఞానాన్ని పొందేవిధంగా త్రైతసిద్ధాంత భగవద్గీత దోహదపడుతుందని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక చిలుకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు అన్నారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికాలంలో మానవుడు సుకదుఃఖాలలో, మానసిక ఒత్తిడితో కొట్టుమిట్టాడుతున్నారని భగవద్గీత పారాయణంతో ఆత్మసంతృప్తి పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు వై.రామాంజనేయులు, కోటేశ్వరమ్మ, అరుణకుమారి, చిలకమ్మ, వెంకట్రావు, సతీష్, అవినాష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.